# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాజధాని అమరావతిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ప్రజలు నివేదించిన సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి బీ. సీ. జనార్ధన్ రెడ్డి తెలిపారు.
- విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంచేలా "సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్-2026" నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు.
- రాగల రెండు రోజుల్లో ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

========================

రాజధాని అమరావతిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాజధాని నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి ఈరోజు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు, రాజధాని నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. వర్షాకాలం వచ్చేలోగా పూర్తి చేయాల్సిన పనులపై తాము పెట్టుకున్న లక్ష్యాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి.. నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందేనని.. ఈ విషయంలో ఏమాత్రం రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ప్రతి నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రాజధాని ప్రతిష్ఠ పెంచేలా ఆలోచనలు ప్రభుత్వంతో పంచుకోవాలని కోరారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలిగే ఆలోచలనలు చేయాలని, గ్రీన్ ఎనర్జీ, ఇతర సాంకేతికతను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

========================

ప్రజలు నివేదించిన సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీ. సీ. జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈరోజు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. వారు వివరించిన సమస్యలను విన్నారు. సమస్యలను పరిశీలించి.. పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలు నివేదించిన సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి నిర్దిష్ట సమయంలోగా పరిష్కరిస్తామని తెలిపారు.

=======================

విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని, అవగాహనను పెంచే లక్ష్యంతో "సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్-2026" నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి విద్య శాఖా అధికారులకు సూచించారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్-2026 గోడ పత్రికను కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తో కలిసి ఆయన ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులలో నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఇటువంటి విజ్ఞాన యాత్రలు ఎంతో దోహదపడతాయన్నారు. భువనేశ్వర్‌లో ఈనెల 16, 17వ తేదీల్లో రెండు రోజుల పాటు జరుగనున్న ఈ యాత్ర ప్రయోగాత్మక అభ్యాస అనుభవాన్ని అందిస్తుందన్నారు.

=======================

గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ లో మరికొన్ని అధునాతన వైద్య పరికరాలను ఈరోజు అందుబాటులోకి తెచ్చారు. న్యూక్లియిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ టెస్టింగ్ సిస్టమ్ (NATS) అడ్వాన్స్‌డ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ట్రాన్స్‌మిసి బుల్ ఇన్ఫెక్షన్స్ (TTI) స్క్రీనింగ్ సిస్టమ్ ను మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్. అహంతెం శాంతా సింగ్  ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన వైద్య పరికరాలు వైద్య పరీక్షలలో, వ్యాధుల నిర్ధారణలో ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు.  ఇన్ఫెక్షన్‌లను ముందస్తుగా గుర్తిస్తాయని పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

=======================

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు ఉత్తమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గాలివీడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ నిర్వహణ, వైద్య సేవల పనితీరు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం తూముకుంటలో ఏర్పాటు చేస్తున్న 500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ పనులను పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

=======================

అపరిష్కృత కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని.. కక్షిదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా ప్రిన్సిపల్ జడ్జ్ అరుణసారిక కోరారు. శ్రీకాళహస్తిలోని కోర్టు ప్రాంగణంలో `ఏక్ పేడ్ మాకే నామ్` కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఆమె మొక్కలు నాటారు. అనంతరం కోర్టు సముదాయాన్ని పరిశీలించారు. లోక్ అదాలత్ ద్వారా అత్యధిక కేసులు పరిష్కారం కావడంపై సిబ్బందిని అభినందించారు.

విరామం

=======================

బాలల హక్కుల ఉల్లంఘన జరిగితే సహించేది లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చల్లా మధుసూదన రావు స్పష్టం చేశారు. శ్రీకాకుళంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... బాలల హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రెండు సంఘటనలపై సమగ్ర విచారణ జరిపేందుకు పాతపట్నం, హిరమండలం ప్రాంతాల్లో పర్యటించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు సంతృప్తికరంగా లేవని, బాలలకు భద్రత కల్పించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. బాలల హక్కులపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

========================

విపత్తుల నిర్వహణపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ పి. వెంకటరమణ తెలిపారు. రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో గుంటూరులో ఈ రోజు నిర్వహించిన మాక్ డ్రిల్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో 190 అగ్నిమాపక కేంద్రాల పరిధిలో ప్రతి నెలా విద్యార్థులకు, ప్రజలకు విపత్తుల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే 600కు పైగా మాక్ డ్రిల్స్ నిర్వహించామని వెల్లడించారు.

========================

రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం అనకోడేరు గ్రామంలో 2 కోట్ల 89 లక్షల రూపాయలతో నిర్మించనున్న కొమరాడ - అనకోడేరు రహదారి, వెంప గ్రామంలో  2 కోట్ల 80 లక్షల రూపాయలతో  నిర్మించనున్న మొగల్తూరు -  భీమవరం రహదారి పనులకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పట్టణాల రహదారులను గ్రామాలతో అనుసంధానం చేసి.. మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు.

========================

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు నేషనల్ ఇన్నోవేషన్, డిజైన్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ బూట్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ హేమచంద్ర తెలిపారు. ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... కేంద్ర విద్యా శాఖ, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 10 రాష్ట్రాల నుంచి మొత్తం 259 మంది విద్యార్థులు ఈ బూట్ క్యాంప్ లో పాల్గొంటారని ఆయన వెల్లడించారు. విద్యార్థుల్లో ఆవిష్కరణ దృక్పథం, సమస్య పరిష్కార ఆలోచనా విధానం, వ్యాపార దృష్టిని పెంపొందించడం ఈ బూట్ క్యాంప్ లక్ష్యమని పేర్కొన్నారు.

========================

దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్ దాని పరిసరాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరట్వాడా నుంచి అంతర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఏర్పడిన ద్రోణి సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. వీటి ఫలితంగా రాగల రెండు రోజుల్లో రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్ర ప్రదేశ్ లో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మరిన్ని వివరాలను వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మి తెలియజేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

========================

తిరుపతి గ్రామీణం పరిధిలోని పేరూరు చెరువు - అవిలాల చెరువుల సరఫరా ఛానల్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తుడా అధికారులతో కలెక్టర్ ఈరోజు సమీక్ష జరిపారు. 8 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఛానల్ పనులకు టెండర్లు

పిలవాలని, అవిలాల చెరువు సుందరీకరణలో భాగంగా కరకట్టపైన పనులు పూర్తి చేసి.. ఆహార దుకాణాలు, నడక మార్గాలు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

========================

========================